# డా॥హేమమాలిని

## 'ఎదురుగాలి'


"ఏమండి ఈ రోజు నాలుగింటికల్లా వస్తారుగా" అన్న లక్ష్మి మాటలు ఆఫీసుకు బయలుదేరిన చలపతి కాళ్ళకి బ్రేకులువేశాయి.

"నాలుగింటికా" ప్రశ్నార్థకంగా అడిగాడు వెనక్కి తిరిగి చూచి.

"నేననుకుంటూనే ఉన్నాను మీకు మతిమరుపని. ఈరోజే ఆఖరి రోజండీ. రేపు, రేపు అంటూ ఇన్నాళ్ళు వాయిదా వేస్తూ వచ్చారు. ఈ ఒక్క రోజుతో అది కాస్తా ఎత్తేస్తారు. మనం ఈరోజు తప్పకుండా వెళ్ళాలి. కనక మీరు పెందరాళే ఇంటికిరావడంమర్చిపోరుగా" అంది.

"ఆరు నూరయినా... నూరు ఆరయినా నాలుగింటికల్లా గుమ్మంలో ఉంటాను, సరేనా" అన్నాడు. అలా అనకపోతే నెత్తిమీద కుండ బోర్లిస్తుందన్న భయంతో.






తలుపు వేసుకొని లోపలికి వెళ్ళిపోయింది లక్ష్మి, సాయంత్రం చేయాల్సిన పనులన్నీ అప్పుడే పూర్తిచేసుకునేందుకు.

సాయంత్రం అయిదయింది. ఆఫీసులో కూర్చొని సీలింగు ఫ్యాన్ వైపు చూస్తూ కూర్చున్నాడు చలపతి ఇంకా కనీసం రెండు గంటలయినా గడిస్తేగాని ఇంటికి వెళ్ళడం కుదరదు అనుకుంటూ.

"ఏమిటోయ్ చలపతీ ఇంటికివెళ్ళే ప్రయత్నంలో ఉన్నట్టులేవే" అన్నాడు పక్క సీటు సీతాపతి, ఫైల్స్ సర్దుతూ.

"ఈరోజు ఎట్టిపరిస్థితుల్లోనూ తొందరగా వెళ్ళకూడదనుకున్నానోయ్"

"అంత కష్టమేమి వచ్చి పడింది"

"కష్టం కాకపోతే మరేమిటి? ఊళ్ళోకి 'ఎగ్జిబిషన్ కం సేల్' వచ్చిందట, నా ప్రాణానికి. మా ఆవిడ ఒక పేచం పేస్తుంది.

ఈ రోజు ఆఖరి రోజట. ఈ ఒక్క రోజు తప్పించుకుంటే చాలు నాలుగొందలు మిగులుతుంది."

"నువ్వే నయమోయ్! నేను మా ఆవిడ కోరల్లో చిక్కుకొని మూడొందలుధారపోశాను. అక్కడ కొన్న బట్టలకు అయినా నీ భార్య ఊరుకుంటుందా?" అన్నాడు సీతాపతి తన గయ్యాళి భార్యను గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఏం చేస్తుంది? ఈ రోజంతాఅలుగుతుంది. ఇంటికి వెళ్తూ హోటల్లో శుభ్రంగా టిఫిన్ తినేశాననుకో. ఈ రాత్రి భోజనం లేకపోయినా ఫర్వాలేదు, ఇక ఆవిడ్ని శాంత పరచడానికి రేపు శెలవు పెట్టేశానుగా. అది చాలు. అప్పుడప్పుడు ఇలా యుక్తిగా ప్రమాదాల్ని తప్పించుకోవాలోయ్. లేకపోతే ఈ ఆడవాళ్ళు చేసే 'నో వర్క్, నో సాంగ్' (అంటే 'పనీ పాటి లేని' అని చలపతి ఉద్దేశ్యం లెండి) వ్యవహారాల్నించి తప్పించుకోలేం" అన్నాడు.

ఏడున్నరకి మెల్లిగా ఇంటికి వచ్చాడు చలపతి. నిశ్శబ్దంగానున్న ఇల్లు భయంకలిగించినా గుండె ఓటవు సరచుకున్నాడు. మంచంమీద ముసుగేసుకుని పడుకున్న లక్ష్మి కనిపించగానే ఆకాశంమేఘావృతమై ఉండనిమిషంలోనైనా ఉరుములు మెరుపులతో కుంభవృష్టి మొదలవ వచ్చని అర్థమైపోయిందతనికి.

"ఏయ్ లక్ష్మి. భోజనం పెట్టు, ఆకలి దంచేస్తుంది!" లేని హుషారు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు.

అంతే! ఆ మాటలతో బాంబ్ ఫ్యూజ్ అంటుకుంది.

"అసలూ, నాలుగు గంటలకు రాకూడదనుకున్న పెద్దమనిషి ఆ సంగతి ఉదయమే చెప్పొచ్చుగా. నన్ను మాటలతో మభ్యపెట్టడం ఎందుకు. హూఁ... ఏం బ్రతుకో... నేనేం నగలడిగానా, నాణ్యాలడిగానా...చౌకగా వస్తున్నాయి కదా అని ఒక అయిదు చీరెలు కొనిపెట్టమన్నాను. ఒక చీరె కొంటే ఇంకొక చీరె ఉచితంగా ఇస్తారట. ఐదు చీరెలుకొంటే ఇంకో ఐదు చీరెలొచ్చేవి. ఇప్పుడు కొంటే సంవత్సరం దాకా నోరెత్తేదాన్నా...ఈ ఒక్క రోజేనండీ అని పదిసార్లు చెప్పాను. అయినా చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహాదేవా అన్నారు. పెళ్ళాంమీద ప్రేముంటే ఇలాగ ఎందుకు చేస్తారు. అయినా, అందరు మీలాగే ఉన్నారా... ప్రక్కింటి కళ్యాణిగారు నాలుగు చీరెలు కొన్నారు. నాలుగుకి నాలుగు చీరెలు ఫ్రీ. అంటే ఆవిడకి ఎనిమిది కొత్త చీరెలు వచ్చాయి. అవతలింటి పిన్నిగార్కి కొనిపెట్టారు బాబాయిగారు. నా మొహానికే ఏమీ లేవు" చిటపట లాడిందామె.

"అదికాదు లక్ష్మి ...నేనేమన్నా కావాలని ఆలస్యం చేసానా"... అంటున్న చలపతి మాటలని మధ్యలోనే తుంచేస్తూ "ఇంక ఆపండి మీ కల్లబొల్లి కబుర్లు" అంది లక్ష్మి.

"ముందు నా మాటలు వినమన్నానా. ఆఫీసులో నాలుగింటి కల్లా బయలుదేరాను. అంతలో ఆఫీసరుగాడు అర్జంటు కాగితాలు పంపించాడు. అయినాసరే, ప్రొద్దున్న నీకు చేసిన ప్రామిస్ గుర్తుకొచ్చి వెళ్ళి అడిగాను 'సార్, ఈపని రేపు ఎర్లీగా వచ్చి చేస్తాను, ఇంట్లో అర్జంటు పని ఉందని'

'కావాలిస్తే రేపు శలవు గ్రాంటు చేస్తాను, ఈరోజు మాత్రం ఈపని చేయ్యాల్సిందే' అన్నాడా రాక్షసుడు" అంటూ ఆమె మొహంలోకి చూసాడు చలపతి. ఆమె మూడ్‌లో ఏం మార్పు రాకపోవటంతో "అయినా నీతో ఏం చెప్పి లాభంలే, అదంతా నా ఖర్మ. రేపొక్క రోజు ఆ వెధవ ఎగ్జిబిషన్ ఉంటే అయిదేంటి పది చీరెలు కొనిపెట్టేవాడ్ని. నీతో ఇన్ని మాటలు పడేవాడ్ని కాదు. నీ దృష్టిలో ప్రక్కింటి కామేశంగాడి కంటే చేత కాని వెధవలా కన్పిస్తున్నాను. మా ఆఫీసరు అసలే చండశాసనుడని నీకు తెల్సు. ఏదో నువ్వే నన్ను అర్థం చేసుకుంటావనే అనుకున్నాను. అందుకే ఆఫీసరు అన్నదే తడవుగా రేపు నీతో ఆనందంగా గడపొచ్చని శలవు పెట్టాను" అన్నాడు ఆమె మీద చెయ్యి వేసి.

"హుఁ... ఈసారి కొని పెడ్తారట, అంటే మళ్ళా ఏ సంవత్సరానికో వస్తే వస్తుంది ఆ ఎగ్జిబిషను" అంటూ ఉధృతంగా వస్తున్న ఏడుపును కొనసాగిస్తూ చలపతిని విదిలించుకొని అటు తిరిగి పడుకుంది.

ఇక ఈ వాతావరణం రెండు రోజులు దాకా అట్లాగే ఉండే సూచనలున్నాయనుకొని ఆరోజుకిక భోజన ప్రాప్తం లేదని తెల్సినా ఎట్లాగయితేనేం నాలుగొందలు మిగిలాయనుకుంటూ ఆ రాత్రి తృప్తిగా నిద్రపోయాడు...

మర్నాడు ప్రొద్దున కాస్త ఆలశ్యంగా నిద్ర లేచిన చలపతి వంటింట్లో గిన్నెల చప్పుడు, వాటితో పాటే లక్ష్మి తీస్తున్న కూనిరాగాలు విని ఆశ్చర్యపోయినా, 'అమ్మయ్య ఎలాగయితేనేం గాలివాన వెలిసింది' అనుకుంటూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ తరువాత ముఖం కడుక్కొని వచ్చిన అతనికి వేడివేడి కాఫీ అందించి "ఈరోజు మీరు శలవు పెట్టారుగా. పాపిష్టిదాన్ని రాత్రి మీకు భోజనం కూడా పెట్టలేదు. ఈ కాఫీ తాగుతూ పేపరు చూస్తూండండి. పది నిమిషాల్లో మంచి టిఫిను తెస్తాను" లాలనగా అని వంటింటి వైపు నడిచింది లక్ష్మి.

హుషారుగా కాఫీ సిప్ చేస్తూ చేతిలోకి పేపరు తీసుకున్నాడు. మొదటి పేజీలోనే "రండి, త్వరపడండి. ఈ రోజే బొంబే నుండి కొత్తస్టాకు వచ్చింది. ఒక చీరె కొంటే ఒకచీరె ఉచితం. పురజనుల కోరికపై మా ఎగ్జిబిషను మరి రెండు రోజులు మాత్రమే పొడిగించబడింది" అన్న ప్రకటన చూడగానే చలపతికి నిలువు గుడ్లు తేలబడ్డాయి. *

## అయ్యగారు

బిచ్చగాడు: అమ్మా... ధర్మం తల్లీ—

సరోజ: ఇంట్లో ఎవరూ లేరు వెళ్ళు.

బిచ్చగాడు: వంటగదిలో అయ్యగారున్నారుకదమ్మా...

—పి.యస్. ప్రసాద్
నెల్లూరు


## జ్యోతిషం

ఆకాశంలోని నక్షత్రాలవల్లే మీలో ఎన్నో కోరికలు. మీ భవిష్యత్తును ఆధునికశాస్త్రీయ పద్ధతులలో తెలుసుకోండి. వివరాలకై "ఎస్ట్రాలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, 18 జర్నలిస్టు కాలనీ, హైదరాబాద్ - 34" కు వ్రాయండి. ఫోన్: 38570